క్లుప్తంగా

యానాం మున్సిపల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

యానాం: మున్సిపల్ ఉద్యోగులకు సీఎం రంగసామి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పుదుచ్చేరి మున్సిపాలిటీ, కమ్యూన్ పంచాయతీ ఉద్యోగుల సంయుక్త కమిటీ పిలుపు మేరకు యానాం మున్సిపల్ ఆఫీసు ఎదుట మున్సిపల్ ఉద్యోగులు, పెన్షన్‌దారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పెనుపోతుకృష్ణ మాట్లాడుతూ 9 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ అయిన వారికి పింఛన్ల మంజూరు తదితర అంశాలపై నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రంగసామి స్పందించి సమస్యను పరిష్కస్తామని ఎల్ఏడీ డైరెక్టర్ ద్వారా హామీ ఇచ్చారని ఉద్యోగులు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కర్రి రాంబాబు, కార్యదర్శి సీహెచ్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ నీట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

యానాం: 2025–26 విద్యాసంవత్సరానికి యూజీ నాన్ నీట్ కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించేందుకు ఈనెల 7వరకు గడువు పెంచినట్లు శుక్రవారం సెంటాక్ కోఆర్డినేటర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ వద్ద ఉన్న పాత ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తును పూర్తి చేయవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు సెంటాక్ పుదుచ్చేరి వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 0413–265570, 2655571 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

వీరేశ్వరస్వామి సేవలో ఆర్డీవో దంపతులు

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన భద్రకాళి వీరేశ్వరస్వామి సన్నిధిని శుక్రవారం కొత్తపేట ఆర్డీవో దంపతులు అఖిల, పి శ్రీకర్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని వారు పూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేకేటి శ్యామలకుమార్ ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. అనంతరం వారికి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

9 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధం

యానాం: తొమ్మిది రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ శుక్రవారం పుదుచ్చేరి కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పుదుచ్చేరి లాస్‌పేటలో అబ్దుల్ కలామ్ సైన్స్ సెంటర్‌లో కల్యాణ మండపాలు, హోటల్ యాజమాన్యాలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త చలవనాయకి మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా రోజుకు 40 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వివిధ వీధుల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. మరో 20 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు రెస్టారెంట్లు, హోటళ్లు, కల్యాణ మండపాలు తదితర వాటి నుంచి వస్తోందన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వాటిని వాడాలని ఆయన సూచించారు.

నూతన ఆలయానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో కేశవపురంలో పురాతన రామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో శుక్రవారం నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు భూమి పూజ నిర్వహించారు. అర్చకులు, పండితుల ఆధ్వర్యంలో నూతన ఆలయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానానికి టికెట్ కౌంటర్ బహూకరణ



అంతర్వేది దేవస్థానానికి టికెట్ కౌంటర్ బహూకరించిన దాతలతో అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి శుక్రవారం రామేశ్వరానికి చెందిన దాతలు చెరుకూరి వంశీ లక్ష్మీపతిరాజు, పేరిచర్ల రామరాజు వర్మలు రూ.1.80 లక్షల విలువైన టికెట్ కౌంటర్‌ను బహూకరించారు. ఈ మేరకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ పి.విజయ సారథి సమక్షంలో ఆలయానికి వారు అందజేశారు.

గుబురుగా తుప్పలు.. ప్రయాణానికి తిప్పలు

- వృద్ధ గౌతమి వెంబడి రక్షణ గట్టుపై ప్రమాదకరంగా ప్రయాణం
- రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల తరలింపునకు ఇక్కట్లు



పల్లంకుర్రు గొల్లగరువు సమీపంలో రక్షణ గట్టు గ్రావెల్ రోడ్డుపై దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లు



రోడ్డుపై ఇరువైపులా తుమ్మ చెట్ల మధ్యలో చిర్రయానం వెళుతున్న ఆర్టీసీ బస్సు

కాట్రేనికోన: వృద్ధ గౌతమీ గోదావరి నది వెంబడి ఉన్న రక్షణ గట్టుపై పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప వరకు దట్టంగా పెరిన తుమ్మ చెట్లను తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో గోదావరి నది వెంబడి పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప వరకు రక్షణ గట్టు గ్రావెల్ రోడ్డుపై తుమ్మ చెట్లు గుబురుగా పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లంకుర్రు నుంచి బూలవారి మొండి, గొల్లగరువు, జైభీమ్ నగర్, గెద్దాడివారి పేట, రామాలయం పేట, మొక్కల తిప్ప తదితర గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ అవసరాలు, ఆక్వా రైతులకు ఈరోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. తుమ్మ చెట్లు దట్టంగా పెరిగిపోవడంతో ప్రయాణానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పంట చేల నుంచి వరి ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకునేందుకు, ఆక్వా రైతులు చెరువులకు అవసరమైన మేతలు, పట్టుబడి అనంతరం రొయ్యలు, చేపలను ఈ రోడ్డుపై ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తరలించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అన్నారు.

108 వంటి అత్యవసర సర్వీసులు వెళ్లేందుకు ఇబ్బందులు

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మ చెట్ల కారణంగా చిర్రయానం, నీళ్ళరేవు సముద్ర తీర ప్రాంతాలకు 108 వంటి అత్యవసర సర్వీసులు సకాలంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాజానగరం నుంచి గచ్చకాయలపోర సముద్ర తీరం వరకు పర్రభూమికి ఉన్న రక్షణ గట్టుపైన, కాపులపాలెం నుంచి నీళ్లరేవు వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తుమ్మ చెట్లు చిట్టడివిని తలపించేంలా పెరిగిపోవడంతో 108, 104 వంటి అత్యవసర సర్వీసులతో పాటు ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాజానగరం, కాపులపాలెం, నాగపట్టణం, మర్రి చెట్టు కాలనీ, చిర్రయానం, నీళ్లరేవు గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగానే ప్రయాణిస్తున్నారు. పల్లం, చిర్రయానంలో పురాతనమైన కాలభైరవస్వామి తదితర ఆలయాలు, సముద్రపు బీచ్ అందుబాటులో ఉండటంతో పర్యాటకులు రద్దీ అధికంగా ఉంటుంది. మోటారు సైకిల్‌పై వెళ్లే వాహన చోదకులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుమ్మ చెట్లు కళ్లకు తగలడంతో గాయాలపాలవడంతో తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు.

తుమ్మ చెట్లు తొలగించేందుకు చర్యలు

ఉపాధి హామీ పథకంలో జంగిల్ క్లియరెన్సు చేపట్టాల్సి ఉంది. తుమ్మ చెట్లు తొలగించేందుకు ప్రత్యేకించి నిధులు లేకపోవడంతో పనులు చేపట్టలేకపోయాం. మండల పరిషత్ సమావేశంలో సభ్యులతో మాట్లాడి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మ చెట్లు తొలగించేందుకు చర్యలు చేపడతాం.

– వెంకటాచలం, ఎంపీడీఓ, కాట్రేనికోన

తుమ్మ చెట్లతో ఇబ్బందులు



సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మ చెట్లను తొలగించాలి. పురాతనమైన కాలభైరవ స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో ప్రతి రోజు వస్తున్నారు. తమ్మ చెట్లు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరగడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– మల్లాడి వీరబాబ్జీ, సర్పంచి, పల్లం

దేశాన్ని దోచేస్తున్న కార్పొరేట్ కంపెనీలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు

అమలాపురం టౌన్: దేశాన్ని కార్పొరేట్ కంపెనీలు మతోన్మాద శక్తులతో చేతులు కలిపి దోచేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా పార్టీ నాయకుడు నూకల బలరామ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి నాగేశ్వరరావుతో పాటు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేట్ కంపెనీలు ఈ దేశ సంపదను ఎలా దోచుకుంటుందో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పలు తీర్మానాలు, డిమాండ్లతో కూడిన నివేదికను సమావేశంలో ప్రవేశపెట్టారు. పార్టీ నాయకులు జి.దుర్గా ప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు పాల్గొన్నారు.

జాతీయ పోలీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ అప్పన్నను సత్కరించిన జిమ్ క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీస్ దళం కానిస్టేబుల్ బి.అప్పన్న ఆల్ ఇండియా నేషనల్ పోలీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోలీస్ విభాగం సెలెక్షన్స్ ట్రయల్స్‌లో అప్పన్న అత్యుత్తమ ప్రతిభ చాటి జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ అప్పన్నను స్థానిక జిమ్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన అభినందన సభలో ఆయనను జిమ్ క్రీడాకారులు ప్రశంసించి, సత్కరించారు. శ్రీకాకుళానికి చెందిన అప్పన్న ప్రస్తుతం అల్లవరం మండలం ఓడలరేవు మెరైన్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పవర్ లిఫ్టింగ్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిమ్ క్రీడాకారులు అల్లాడ వెంకటరమణ, ఎంవీ సముద్రం తదితరులు కానిస్టేబుల్ వీరన్నను సత్కరించి అభినందించారు.

నైట్ వాచ్‌మెన్లకు వేతన బకాయిలను విడుదల చేయాలి



పాఠశాలల నైట్ వాచ్‌మెన్లతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరామ్

అమలాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్లకు నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలను ఇవ్వాలన్న డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో నైట్ వాచ్‌మెన్లు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారని బలరామ్ తెలిపారు. వేతన బకాయిల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న నైట్ వాచ్‌మెన్లతో స్థానిక యూటీఎఫ్ హోంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరామ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్లకు జీతం రూ. 6 వేలు మాత్రమేనని, ఆ జీతం కూడా సకాలంలో ఇవ్వకపోతే వారు ఎలా జీవిస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజుకు 8 గంటలు పనిని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లా వాచ్‌మెన్ల సంఘం ఏర్పాటై నూతన కార్యవర్గాన్ని సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడిగా నూకల బలరామ్, అధ్యక్షుడిగా బొక్కా రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చింతలపల్లి వీవీ సత్యనారాయణ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సభలో జిల్లాలోని 22 మండలాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే నైట్ వాచ్‌మెన్లు, మహిళా సంఘాల నాయకురాళ్లు భవాని, అమూల్య, అంగన్ వాడీ సంఘాల నాయకురాళ్లు దైవకృప, ఉమ పాల్గొన్నారు.

యానాం అభివృద్ధికి అహర్నిశలు కృషి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మల్లాడి

యానాం: వచ్చే ఏడాది పుదుచ్చేరి అసెంబ్లీకి నిర్వహించనున్న ఎన్నికల్లో యానాం నియోజకవర్గం పరిధిలోనే తన రాజకీయం ఆగిపోదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యర్రా గార్డెన్స్‌లో భారీస్థాయిలో ఏర్పాటుచేసిన తన 62వ పుట్టినరోజు వేడుకలనుద్దేశించి ఆయన మాట్లాడారు. యానాం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్టు ఆయన అన్నారు. పుదుచ్చేరి, కారైకల్‌లో నలుగురు ఎమ్మెల్యేలతో సహా తాను మొత్తం అయిదుగురు ఘన విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టడం ద్వారా చక్రం తిప్పేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పుట్టినరోజు, నూతన సంవత్సరం సందర్భాల్లో శాలువాలు, జ్ఞాపికలు, పుష్పచ్ఛాలు తీసుకురావద్దని వాటిని కొనుగోలు చేసే డబ్బులను యానాం వృద్ధాశ్రమానికి విరాళంగా ఇవ్వాలన్నారు. యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు అవసరమని భక్తులు, దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మల్లాడి కృష్ణారావు పుట్టిన రోజు సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు మల్లాడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, వేగేశ్న భాస్కరరాజు, కుడిపూడి శివన్నారాయణ పాల్గొన్నారు.

యోగా సాధనతో పరిపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు తదితరులు

అమలాపురం టౌన్: ప్రతి మనిషి నిత్యం యోగా సాధనతో పరిపూర్ణమైన ఆరోగ్యంతో జీవించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని డాక్టర్ వెంకట్రావు ప్రారంభించి ప్రసంగించారు. పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, అమలాపురం మున్సిపల్ కమిషనర్ బి.రాణి సంయుక్తతో పాటు కోనసీమలోని పలు మండలాలకు చెందిన పశు వైద్యులు, సిబ్బంది గురువుల సూచనలతో యోగాసానాలు వేశారు. పశు వైద్యాధికారులు ఎం.నారాయణరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేశ భక్తి గీతాలాపనపై శిక్షణ



విద్యార్థినులకు దేశ భక్తి గీతాలాపనపై శిక్షణ ఇస్తున్న ప్రజా నాట్య మండలి ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా సమితి శాఖ ఆధ్వర్యంలో స్థానిక బంగారు, వెండి వర్తకుల సంఘ భవనంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ తరగతుల్లో ఔత్సాహికులకు ముఖ్యంగా విద్యార్థులకు అభ్యుదయ, దేశ భక్తి గేయాలపై ప్రజా నాట్య మండలి ప్రతినిధులు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రజా నాట్య మండలి జిల్లా సమితి కన్వీనర్ వేమగిరి శామ్యూల్ అధ్యక్షతన ఈ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ చెలికాని స్టాలిన్ హాజరయ్యారు. అమలాపురం అభ్యుదయ ఆర్ట్స్ జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు మహంతి లక్ష్మణరావు, ముప్పన కుమార్, పోలిశెట్టి కృష్ణ, మందపల్లి ప్రేమానందం పర్యవేక్షణలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట నియోజకవర్గాల నుంచి వచ్చిన వారికి శిక్షణ ఇచ్చారు. ప్రజా నాట్య మండలి ప్రిన్సిపాల్‌గా పెద్దిరెడ్డి రాము, వైస్ ప్రిన్సిపాల్స్‌గా విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవి, అభ్యుదయ ఆర్ట్స్ జిల్లా కన్వీనర్ సత్తిబాబు పర్యవేక్షించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ ప్రతినిధి నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

అమలాపురం రూరల్: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే అంబేడ్కర్ కోనసీమ జిల్లా కమిటీ అధ్యక్షుడు మండేల నాగవెంకటప్రసాద్ (బాబి), ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. కలెక్టర్ మహేష్ కుమార్ జర్నలిస్టుల ప్రతినిధులతో మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే 50 శాతం ఫీజు రాయితీ కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీనిపై ఫైల్ సిద్ధం చేయాలని డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డీపీఆర్వో లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి ఎంవీ అబ్బాస్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



గొల్లవిల్లి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంటు డైరెక్టర్ సురేష్

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సమగ్రశిక్షా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంటు డైరెక్టర్ ఎమ్.సురేష్ అన్నారు. మండలంలోని గొల్లవిల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎంఈవో సత్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోకరకొండ కనకదుర్గ, సీఆర్ఎమ్‌టీలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన నరసింహమూర్తి, సత్యనారాయణ

అమలాపురం టౌన్: అమలాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 40 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభకు లైబ్రేరియన్ పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. జిల్లా శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ సభకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఏప్రిల్ 28న మొదలైన వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు పలు అంశాలపై నిపుణులు శిక్షణనిచ్చారని లైబ్రేరియన్ సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రతిభా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా హాజరైన నరసింహమూర్తి, సత్యనారాయణ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది భవాని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

అమలాపురం టౌన్: పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఆర్డీవో కొత్త మాధవి శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యత, రుచిని పరిశీలించారు. క్యాంటీన్‌లో వంటల చేసే వారితో, భోజనాలు చేస్తున్న వారితో ఆర్డీవో మాట్లాడి ఆహార పదార్థాల రుచిపై ఆరా తీశారు. ఆర్డీవో పాటు మున్సిపల్ కమిషనర్ బి.రాణి సంయుక్త పాల్గొన్నారు.

హైఓల్టేజీతో కాలిపోయిన విద్యుత్ పరికరాలు



సమనసలో కాలిపోయిన విద్యుత్ మీటర్లు

అమలాపురం రూరల్: సమనస గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విద్యుత్ ప్రమాదంలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్టేట్ బ్యాంక్‌తోపాటు సమీప గృహాల్లో విద్యుత్ మీటర్లు, విద్యుత్ పరికరాలు హైఓల్టేజ్ కారణంగా కాలిపోయాయి. ఒక్కసారిగా పొగలు, మంటలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బాధితులు అగ్నిమాపక, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది ఇసుక సహాయంతో మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదం తెల్లవారుజామున కావడంతో పెను ప్రమాదం తప్పిందని బాధితులు వాపోయారు. స్థానికంగా విద్యుత్ హెచ్చు తగ్గుల సమస్య ఉందని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో విద్యుత్ హెచ్చు తగ్గుల కారణంగా టీవీలు, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు వంటి పరికరాలు కలిపోయాయని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

పదోన్నతి పొందిన డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం



శ్రీరామ శరణ్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ చిరంజీవిరావు, గ్రామ పెద్దలు

అమలాపురం రూరల్: సాకుర్రు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసిన నందంపూడి శ్రీరామ శరణ్ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు కొనియాడారు. పదోన్నతిపై కామనగరువు–2 సచివాలయ గ్రేడ్–5 కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన శ్రీరామ శరణ్‌ను సచివాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. డిజిటల్ అసిస్టెంట్‌గా శ్రీరామ శరణ్ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించారని ప్రశంసించారు. కార్యదర్శిగా కామనగరువులో ప్రజలకు మరింత అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. అనంతరం శ్రీ రామ శరణ్‌కు శాలువ, మెమొంటో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యదర్శి రామ శైలజ, పొలమూరి ధర్మపాల్, మాజీ సర్పంచ్‌లు ములపర్తి సత్యనారాయణ, ఆకుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ బండారు చినచంద్రరావు, పీకే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల జారీకి ప్రత్యేక కౌంటర్లు



సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్, అమలాపురం

అమలాపురం రూరల్: విద్యార్థుల పాఠశాలలు, కళాశాలకు వెళ్లేందుకు వీలుగా ఉండే సమయంతో ఆయా రూట్లలో బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి శుక్రవారం తెలిపారు. కళాశాలలు ఇప్పటికే తెరవడంతో బస్‌పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించామని ఆయన తెలిపారు. 50 కిలోమీటర్ల పరిధి వరకు బస్సు పాసులు జారీ చేస్తున్నామన్నారు. సదరం సర్టిఫికేట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు జారీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా బస్ పాసులను, మిగిలిన వారికి రాయితీతో పాసులు ఆర్టీసీ జారీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాస్‌లు ఏడాది వరకు చెల్లుబాటు అవుతాయన్నారు. పాస్‌కు నిర్దేశించిన ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డుకు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రజారవాణా శాఖ బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించినట్టు డీఎం తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ జత చేయాలన్నారు. స్టడీ సర్టిఫికేట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం పాసు మంజూరుకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

ఘనంగా గజమాల యాత్ర

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు శుక్రవారం ఘనంగా జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువకుల ఉత్సాహం నడుమ ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి నుంచి పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ మీదుగా అప్పనపల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ సంఘం యువత మోటార్ సైకిళ్ల ర్యాలీలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు నయినాల కాశీ, యాండ్ర వీరబాబు, జోగి వెంకటరామకృష్ణ, నయినాల రామకృష్ణ పాల్గొన్నారు.